కథ

# మా ఇంటికి రాకండి!

అంపర్తి రామకృష్ణ

మా తాతకి ఎనభైయ్యేళ్లు నిండాయి. మా తాత శరీర భాగల్లో బాగా చురుగ్గా వుండేది నోరే... శరీరంలో అన్ని భాగాలు పని చెయ్యమని మొండికేసినా మాతాత నోటికి దడిసి ఏదో అలా లాక్కొస్తున్నాయి ముసలాయిన్ని. ఆయన ఐఏయస్ ఉద్యోగం కూడా నోరు మరింత పదునెక్కడానికి దోహదపడింది. తాత పేరు జోగయ్య... ఐఏయస్ అధికారి కాగానే జోగిరావు అనిపేరు మార్చుకున్నాడు. ఆపేరును మరింత షార్ట్ కట్ చేసి "జోగా, ఐఏయస్" అని నేమ్ బోర్డు మీద రాయించుకున్నాడు. వారం రోజుల్నుంచి మంచం మీద నుంచి లేవడంలేదు. మంచానికి అతుక్కుపోయి వుండే నాన్న తాతగారిని హాస్పిటల్‌కు తీసుకువెళ్ళి పరీక్షలు చేయించాడు. "డాక్టరుగారు ఏమన్నారు తాతా?" హాస్పిటల్ నుంచి తాతగారు ఇంటికి వొచ్చేక అడిగాను. "మరో మూడు వారాల కంటే బతకనురా...కిడ్నీలు పనిచెయ్యడం లేదు ఎడమ కాలులోని ఆర్టరీస్‌లో బ్లడ్ క్లాట్ అయ్యింది... గాంగ్రీన్ వొచ్చే ప్రమాదం వుంది..కాలు తీసేస్తారేమో! అయిన వాళ్లందరికి ఫోను చెయ్యి.. అందరూ వచ్చి చూసివెళ్తారు... నా అంతిమ యాత్ర సింపుల్‌గా వుండాలి రా... ఆర్భాటం వద్దు... నవ్వుతూ పంపించండి...పేపర్లో సంతాప ప్రకటనలు వొద్దు... నాట్ ఎ స్టోన్ షుడ్ టెల్ ఐయామ్ బర్రీడ్.. ఐషుడ్ గో అన్ లామెంటెడ్" అన్నాడు తాత.



తాత చనిపోతాడనే ఊహే భరించలేకపోయాను.

"నీకేం కాదు తాతా! మూడేళ్ళ క్రిందట డాక్టర్లు ఇలాగే అన్నారు... వారం రోజులకంటే బ్రతకవని చెప్పారు... అయినా సెకెండ్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ బాగానే చేస్తున్నావ్ తాతా!" అన్నాను తాత చెయ్యి నిమురుతూ.

"అదికాదురా బాబు! నిజంగా నేను చనిపోతాననుకున్నావా? అందరినీ ఏడిపించిగాని వెళ్ళను... నేను చనిపోయే స్థితిలో వున్నానంటే అందరిలో సానుభూతి పెరుగుతుంది... అందరూ జాలిగా నావైపు చూస్తుంటే నాకు నవ్వొస్తుంది.. నాకు ఇష్టమైన వంటకాలు, పుస్తకాలు తెచ్చియిస్తారు.." అన్నాడాయన

నా మనస్సు మాత్రం స్థిమిత పడలేదు. తాత చివరిరోజులు తలచుకునేసరికి దుఃఖం పొర్లుకు వొచ్చింది.

"నవ్వుతూ బ్రతకాలిరా వెధవాయ్ చివరిక్షణం వరకూ... నేనన్నానని నిజంగా పేపరు ప్రకటన ఇవ్వకుండా వుండేవు...రాష్ట్రం అంతా నేను చనిపోయానని తెలియాలంటే ప్రకటన ఇవ్వాల్సిందే కదా... మా తాత గారికి ఇటువంటివి ఇష్టం లేదు అయినా ఇస్తున్నాను- అని పేపర్లో ప్రకటించాలి" అన్నాడు మాతాత నవ్వుతూ.

డాక్టరూ వచ్చాడు చెకప్ చెయ్యడానికి

"ఎడమకాలు పూర్తిగా పాడయ్యింది... కాలు కదపలేరు...పెద్ద వయస్సు కదా! ఆర్టరీస్‌లో బ్లడ్ కాట్స్ ఏర్పడటం సహజం... వయస్సు మీదపడే కొద్ది శరీరం డికేయింగ్ ప్రాసెస్‌లో వుంటుంది" అన్నాడు డాక్టరు

"నా రెండు కాళ్ళకు ఒకే వయస్సు కదండి... మరి ఒక్క కాలు పనిచెయ్యడం లేదే" అన్నాడు తాత

ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా వుండిపోయాడు డాక్టరు రెండు క్షణాలు.

"మీ బాడీలో వాటర్ తక్కువగా వుంది" అన్నాడు డాక్టరు రిపోర్టు చూస్తూ

"రోజూ విస్కీలో వాటర్ కలుపుకోకుండా తాగేస్తు వుంటాను" అన్నాడు తాత ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"యు ఆర్ వెరీ స్పోర్టివ్.. రోగి అలాగే వుండాలి" అన్నాడు డాక్టరు గారు

"నా శరీరానికే రోగ లక్షణాలు గానీ.. నామనస్సు ఎప్పుడూ యాక్టివ్‌గానే వుంటుందండి"

ఈ ఒక్క విషయం తాత కరెక్టుగా చెప్పాడనిపించింది.

***

పెద్ద పెద్ద పోస్టులలో చేసి రిటైరవ్వడంతో టీ.వీ ఛానల్స్ వాళ్ళు వచ్చారు మా తాతతో ఇంటర్వ్యూ కోసం.

"చనిపోబోతున్నానని తెలిసి మీ అనుభవం ఏమిటి?" ఓ టీ.వీ ఛానల్ రిపోర్టర్ అడిగాడు.

"నేను కష్టపడి సంపాదించినదంతా మా గాడిద కొడుక్కి వెళ్తుందని ఒకటే విచారం" అన్నాడు తాత నవ్వుతూ నావైపు వేలు చూపించి.

టీ.వీ కెమెరాలు నావైపు తిరిగాయి.

మాతాత మీద కోపం వచ్చింది. తమాయించుకున్నాను.

"చనిపోబోతున్నారని తెలిసి భయపడుతున్నారా?" మరో రిపోర్టర్ అడిగాడు తాతను.

"డైయింగ్ ఈజ్ వెరీ ఇంపార్టెంట్ పార్ట్ ఆఫ్ లైఫ్.. ఐయామ్ ఎంజాయింగ్ దిస్ స్టేజ్"

"లైఫ్ ఆఫ్టర్ డెత్ గూర్చి మీ అభిప్రాయ మేమిటి?"

"నాకు తెలిస్తే గదా మీకు చెప్పడానికి... మీరు ఎటూ చనిపోయేక నాదగ్గరకు వస్తారుగా.. అక్కడ మాట్లాడుకుందాం"

ముసలాయన మాటలకు అందరూ నవ్వుకున్నారు.

"ఎనభైయ్యేళ్ళ వయస్సులో కూడా మీ మెదడు షార్ప్‌గా వుంది... మీరు చనిపోయేక మీ మెదడును ఎవరికన్నా ట్రాన్స్‌ప్లాంట్ చేస్తామంటే వైద్యులకి అనుమతి ఇస్తారా?" ఓ రిపోర్టర్ అడిగేడు.

"సైంటిస్టులు, ఐఎయస్‌లు వాళ్ళ బుర్రలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటారు... చివరి దశలో మెదడులో తెలివితేటల గుజ్జు తక్కువగా వుంటుంది... అదే పొలిటిషియన్ మెదడయితే చెక్కు చెదరకుండా వుంటుంది... ఎందుకంటే పొలిటీషియన్ మెదడును ఉపయోగించడు"

మళ్ళీ నవ్వారు అందరూ.

టీ తాగేసి టీ.వీ ఛానల్స్ వాళ్ళు వెళ్ళిపోయారు.

"నలుగురి ముందు నన్ను గాడిద కొడుకని ఎందుకు అన్నావ్?" మాతాత వైపు గుర్రుగా చూస్తూ అడిగాను

"పిచ్చి వెధవాయ్.. మీ నాన్నను నేను ఎప్పుడూ "గాడిద... చవట గాడిద.." అని అంటూ వుంటాను గదా... ఆ గాడిద కొడుకువు కదా నువ్వు.. నిన్ను అనలా. మీనాన్న సంగతి చెప్పా" నా భుజం మీద చెయ్యేసి ఆప్యాయగా నిమురుతూ అన్నాడు తాత.

...మానాన్నని తిట్టడం నాకు బాగా సంతోషాన్ని కల్గించింది. అడిగినప్పుడు డబ్బులు ఇవ్వడు మాబాబు...

***

"ఒరేయ్.. బుచ్చమ్మకు ఫోను చెయ్యి" అన్నాడు మాతాత ఓ రోజు ఉదయాన్నే

బుచ్చమ్మ మాతాత ఆరాధ్యదేవత. ఆమెనే పెళ్ళి చేసుకోవాలనుకున్నాడుగాని, ఏ కారణం చేతో తప్పిపోయింది. ఆమె తన 'వలపుల రాణి' అని చెబుతూ వుంటాడు. ఆమెను పెళ్ళి చేసుకున్నట్లయితే 'దెయ్యం' అనేవాడేమో!

నిజమో ఒట్టిదోగాని చాలా ప్రేమ కథలు చెబుతూ వుంటాడు తాత మంచి మూడ్‌లో వున్నప్పుడు

...బుచ్చమ్మ మొగుడు మాతాతకి స్నేహితుడే! బెంగుళూరు క్యాంప్‌కు వెళ్తున్నానని చెప్పాడట. నిజమేననుకుని రాత్రిపూట బుచ్చమ్మ ఇంటి తలుపు తట్టాడట తాత.. తలుపు తెరవగానే ఎదురుగా కన్పించిన స్నేహితుడిని చూసి "నమ్మక ద్రోహి... స్నేహితుడిని మోసం చేస్తావా?" అడిగాడట రివర్స్‌గేరులో. "ఏమిట్రా?"అర్థం కాలేదు స్నేహితుడికి.." ఊరికి వెళ్తున్నానని చెప్పి వెళ్లకుండా ఇంట్లో తిష్టవేస్తావా? స్నేహితుడికి అబద్ధం ఎందుకు చెప్పావ్? అనవసరంగా సెంటు బాటిల్ కొన్నాను" అన్నాడట మాతాత

ముందే చెప్పాను గదా మాతాతకి నోటిదూల ఎక్కువని.. కోతలు ఎక్కువగా కోస్తాడని... కథలు అల్లడంలో మాతాత దిట్ట...

"ఎక్కడో వంద కిలోమీటర్ల దూరంలో వుంది... ఎందుకు ఆవిడను ఇబ్బంది పెట్టడం" అన్నాను తాతతో

"నేను చెప్పినట్లు చెయ్యరా... నేను చావు బతుకుల్లో వున్నాను... వెంటిలేటర్ మీద వున్నాడు తుదిశ్వాస పీలుస్తూ... ఒకటి రెండురోజుల్లో చనిపోతాడని చెప్పు... పరుగుత్తుకుని వస్తుంది"

"వద్దు తాతయ్య..అలా చెప్పడానికి మనస్సు ఒప్పదు" అన్నాను.

"నీకు మనస్సు అంటూ ఒకటి వుందా ఏమిటి? ఇంజనీరింగ్ చదువుతున్నావ్... ఇంతవరకూ ఒక్క అమ్మాయికి లవ్‌లెటర్ రాయలేదు... మీనాన్న నిన్నో యంత్రం చేశాడు.. ముందు నేను చెప్పినట్లు చెయ్యి"

ఆయన చెప్పినట్లే ఫోన్ చేశాను.

ఆదరాబాదరగా వచ్చేసింది బుచ్చమ్మ

ఆమె వచ్చేటప్పటికి మంచం మీద కూర్చుని ఇడ్లీ తింటున్నాడు తాత లొట్టలు వేసుకుంటూ.


"ఆఖరి చూపు దక్కుతుందో లేదో ననుకుంటూ వచ్చాను...బాగానే వున్నాడు గదా అబ్బాయ్" అందావిడ నాతో.

"పైకి అలా కన్పిస్తున్నాడుగాని... కిడ్నీలు రెండూ చెడిపోయాయి.. ఈవయస్సులో ఇంకా ఏ చికిత్సా అవసరం లేదంటూ ఇంటికి పంపించేసారు" అన్నాను ఆవిడతో.

"నువ్వు వస్తున్నావని కబురు తెలిసి కుదుట పడ్డాడే బుచ్చి" అన్నాడు తాత ఆమె వైపు చూసి నవ్వుతూ.

"అప్పుడప్పుడు నీదగ్గర నుండి మనీఆర్డర్ వస్తూవుంటే నువ్వు బతికే వున్నావని సంబరపడుతూ వుండేదాన్ని...ఈ మధ్య రావడం లేదు... చని

## మళ్ళీ రీమేక్‌కు 'హెలో'



నటుడు రాజశేఖర్‌కు రీమేక్‌లే అచ్చొచ్చినట్టున్నాయి. ప్రస్తుతం షూటింగ్‌లో ఉన్న అతని చిత్రం 'సత్యమేవ జయతే' ఓ హిందీ చిత్రం 'ఖాకీ'కి రీమేక్. ఇంతకు ముందు ఒక మళయాళ చిత్రం నుండి రీమేక్ చేసిన 'ఎవడైతే నాకేంటి', ఒక కన్నడ చిత్రం నుండి రీమేక్ చేసిన 'గోరింటాకు' కూడా మోస్తరు విజయాలను సొంతం చేసుకోవడంతో ఇప్పుడు రాజశేఖర్ మరో రీమేక్‌కు సిద్ధమవుతున్నాడు. మళయాళం సూపర్ స్టార్ మోహన్ లాల్ హీరోగా నటించిన 'హెలో' అనే చిత్రాన్ని ఇప్పుడు తెలుగులో పునర్నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఈ చిత్రంలో అతను ఒక తాగుబోతు లాయర్‌గా కనిపిస్తాడు. "ఒక యాక్షన్ చిత్రం తరువాత ఇలాంటి హాస్య ప్రధానమైన కుటుంబ కథా చిత్రమైతే బాగుంటుందని ఈ కథను ఎన్నుకున్నాం" అంటోంది రాజశేఖర్ భార్య, దర్శకురాలు జీవిత.

పోయావని అనుకున్నా... పోనీలే.. పెద్దవాళ్ళం అయిపోయాం.. ఈ విధంగానన్నా నిన్ను చూడగలిగాను'' అంది బుచ్చమ్మ తాత మంచం దగ్గరకు కుర్చీ లాక్కుని కూర్చుంటూ.

అక్కడ నుంచి వచ్చేయ్యాలని అనుకుంటున్నాను. అదే సమయంలో సరి కొత్త కహానీ మొదలుపెట్టాడు తాత.

''రాత్రి యమదూతలు వచ్చారు నన్ను తీసుకు వెళ్లడానికి.. రెండు రోజులు ఆగండి మా బుచ్చమ్మని చూసాక తీసుకు వెళ్ళుదురు'' అని అన్నాను- వాళ్ళేమో ''అదేం కుదరదు.. మరో రెండు రోజులు ఆగాలంటే నువ్వు మరో చెడ్డపని చెయ్యాలి'' అన్నారు వాళ్ళు.. ఏం చెయ్యాలని వాళ్లనే అడిగాను..ఓ ఫుల్ బాటిల్ విస్కీ కొట్టు లేదా పరాయి స్త్రీ చెయ్యిపట్టుకుని దగ్గరకు లాక్కో' సలహా ఇచ్చేరు వాళ్లు ముందు విస్కీ లాగించేశాను...ఆ తరువాత ధైర్యం వచ్చి నీ చెయ్యి పట్టుకున్నాను'' అన్నాడు తాతయ్య రాత్రి తనకు వచ్చిన కల గుర్చి చెబుతూ.

''చింత చచ్చినా పులుపు చావలేదు... మీ ముసలాడు అఖండుడు'' అంది బుచ్చమ్మ పగలబడి నవ్వుతూ.

''నీ ఆరోగ్యం ఎలా వుంది?'' ఆప్యాయంగా అడిగాడు తాతయ్య ఆమెను.

తాత అడిగిన తీరుకి ఆమె కళ్ళు చెమర్చాయి

***

తాత ఆరోగ్యం క్షీణించిదని తెలుసుకుని బంధువులు, స్నేహితులు మా ఇంటికి ప్రవాహంలా వచ్చిపోతునే వున్నారు. వచ్చిన వాళ్ళు ఉత్తచేతులతో రావడంలేదు. పళ్ళు, స్వీట్స్, పుస్తకాలు తెచ్చి ఇస్తున్నారు. సిటీలో వుండే ఆయన దగ్గర స్నేహితులు ఆయనకు ఇష్టమైనవేమిటో తెలుసుకుని ఆ పిండి వంటలు వండి తెస్తున్నారు.

పేకాటలో మాతాతదే ఎప్పుడు పైచేయి. వచ్చిన వాళ్ళని 'పేకాట ఆడుకుందాం సరదాగా' అని ప్రేరేపించడం- చావుబతుకుల్లో వున్నాడులే...వద్దని చెప్పడం ఎందుకు.. బాధపడతాడు' అనుకుంటూ వచ్చిన వాళ్ళు ఆయనతో పేకాటకు సిద్ధమవుతారు. పేకాటలో ఓడిపోయి జేబులు ఖాళీ చేసుకుని తిరిగి వెళ్తూవుంటారు. ఎవరూ గమనించకుండా నా వైపు చూసి ముసిముసి నవ్వులు నవ్వుతూ వుంటాడు తాత.

దగ్గర బంధువు ఒకాయిన వొచ్చాడు మాఇంటికి.

''బాగా చిక్కిపోయారే'' అన్నాడాయన మాతాత మొహంలోకి చూస్తూ.

తాత పెద్దగా నవ్వేడు

''రెండు కిడ్నీలు చెడిపోయిన వాళ్ళు బ్రతకడం కష్టం.. వేరేవాళ్ళ కిడ్నీ మీకు అమర్చాలంటే వయస్సు మీకు సహకరించదు.. పోయేముందు పుణ్య కార్యక్రమాలు చేయండి'' అన్నాడు వచ్చిన బంధువు.

ఆయన మాటలు రుచించక బయటకు వచ్చేశాను.

మరో ఐదునిముషాల్లో ఆ వచ్చిన పెద్దమనిషి తాతగారి గదిలో నుంచి బయటకు వచ్చాడు.

''మీ తాత తల తిక్క మనిషిలా వున్నాడు రా'' అన్నాడాయన నాతో.

''ఏం జరిగింది?'' ఆసక్తిగా అడిగాను.

''రెవిన్యూ ఆఫీసరుగా ఎన్నోలక్షలు సంపాదించాడు... ఆ డబ్బంతా ఏంచేశాడు? రెండేళ్ళ క్రితం అప్పుల్లో వున్నాను ఇల్లు కట్టుకోవడంతో అన్నాడు... ఇప్పుడేమో మెడికల్ ట్రీట్‌మెంటుకు డబ్బులు లేవు. అని అంటున్నాడు''

''మిమ్మల్ని డబ్బులు అడిగాడా?''

''నాకంటే పెద్ద బెగ్గర్‌లా వున్నాడు మీతాత... చివరి రోజుల్లో నాకు ఏదన్నా సహాయం చేస్తాడేమోనని ఆశపడి వస్తే నన్నే ఓ లక్ష రూపాయలు అప్పుగా ఇవ్వమని అడుగుతున్నాడు''. అన్నాడాయన రుసరుసలాడుతూ.

''మీరేమన్నారు?'' అడిగాను వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

''నా కొడుకులు నా ఒంటి మీద బట్టలన్నీ ఊడ్చుకెళ్ళిపోయారు.. ఇక మిగిలింది గోచి గుడ్డ మాత్రమే! అది నువ్వులాక్కో- అన్నా ఒళ్ళుమండి''

''ఆయనేమన్నారు?'' మళ్ళీఅడిగాను

ఓ క్షణం నావైపు ఎగాదిగా చూశాడు మా బంధువు.

''మీ తాతలాగా నువ్వూ తలతిక్కాడివేరా'' అనేసి వెళ్ళిపోయాడు కోపంగా పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ.

***

చనిపోతున్నాననే దిగులు విచారం లేదు మా తాతకి.

సుబ్బరంగా తింటున్నాడు. ఇంటికి వచ్చిన వాళ్ళతో నవ్వుతూ కబుర్లు చెబుతూవున్నాడు.

ఎవరూ గమనించనప్పుడు బుచ్చమ్మ చేతులు నిమురుతూనే వున్నాడు.

రోజూ వచ్చే డాక్టరు ఇంటికి రావడం మానేశాడు.

ఆయనకు ఫోన్ చేశాను.

''యువర్ గ్రాండ్‌ఫాదర్ ఈజ్ ఇన్‌హై స్పిరిట్స్... ఆ ఉత్సాహమే ఆయన్ని బ్రతికిస్తూవుంది... మీ తాతకు పరీక్షలు చేసిచేసి నాకు నీరసం వచ్చింది...నా కిడ్నీలు పనిచేస్తున్నాయో లేదే నాకే అనుమానంగా వుంది... మరో డార్టరు దగ్గరకు వెళ్ళి పరీక్ష చేయించుకోవాలి''

''మాతాత మూడు వారాలకంటే బ్రతకడని అన్నారుగా... మూడు నెలలు గడిచిపోయాయి''

''మీతాత మాటలతో గారడీ చేస్తాడు..ఆయన కిడ్నీలు కూడా ఏదో గారడీ చేస్తున్నాయి ఇప్పుడు బాగానే పనిచేస్తున్నాయి'' అన్నాడు డాక్టరుగారు

***

రోజూ వచ్చే ఫోన్ కాల్స్ రిసీవ్ చేసుకోవడం పెద్ద ఇబ్బందిగా మారింది మాకు. ఐదునిముషాలకో ఫోన్‌కాల్.

''ఏలా వుంది మీతాత గారికి?''

''డాక్టరుగారు ఏమంటున్నారు..గాంగ్రీన్ వచ్చిన కాలు తీసెయ్యాలంటున్నారా?''

''వీలునామా ఏమన్నా రాశాడా?''

''మాకేమాన్నా డబ్బు పంపమని మీకు చెప్పాడా?''

''చనిపోయాడని ఏవరో అన్నారు...నిజమేనా?''

అడిగిన వాళ్లకు సమాధానం చెప్పడం పెద్ద ఇబ్బందిగా మారింది మాకు.

ఓ ప్రకటన ఇచ్చేశాము అన్ని దినపత్రికలకు

''మా తాత గారి ఆరోగ్యం బాగాలేదని తెలిసి పరామర్శ చేసిన వాళ్ళందరికి పత్రికాముఖంగా కృతజ్ఞతలు..

ఆయన ఆరోగ్యం ఇప్పుడు నిలకడగనే వుంది

ఆయన ఆరోగ్యం మేమే పత్రికాముఖంగా తెలియపరుస్తాము ఎప్పటికప్పుడు...

దయచేసి మా తాతగారి ఆరోగ్యం గుర్చి ఫోన్ చెయ్యొద్దు..మాఇంటికి రాకండి ప్రస్తుతానికి...

★

## బొద్దుగా ఉంటేనే ముద్దు - మీరా చోప్రా



నిన్న మొన్నటి వరకూ పారిస్‌లో నిర్వహించే ఫ్యాషన్ షోలకే పరిమితమైన 'సైజ్ జీరో' మంత్రం ఇప్పుడు సినీ రంగానికి పాకింది. బాలీవుడ్‌లో కరీనా కపూర్ లాంటి చాలామంది హీరోయిన్లు 'సైజ్ జీరో' పేరుతో చిక్కి శల్యమై అస్థిపంజరంపై చర్మపు తొడుగు కప్పినట్టు తయారయ్యారు. అయితే ఈ ప్రభావం ఇంకా మన దక్షిణాదికి రాలేదనే చెప్పాలి. ఇక్కడ ఇంకా బొద్దుగుమ్మలకే డిమాండ్. 'బంగారం', 'వాన' లాంటి తెలుగు చిత్రాల్లో నటించిన మీరా చోప్రాని ఈ విషయమై అడిగితే, తనకు 'సైజ్ జీరో' అంటే అసహ్యమని చెప్పింది, ''అందంగా కనిపించాలంటే వంటిపై కాస్త కండ వుండాలి. అమ్మాయి నడుము మల్లె తీగంత సన్నగా ఉండాలని కవులు చెప్పడానికి చాలా చెప్తారు, కాని కాస్త బొద్దుగా ఉంటేనే అమ్మాయిలు అందంగా కనిపిస్తారు. నా మట్టుకు నేను అన్ని రకాల వంటలూ తినేస్తాను. ఏ కట్టుడి విధించుకోను. అయితే వ్యాయామాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయను'' అంటోంది. ఆమె ప్రస్తుతం రాజా, నమితలతో కలిసి 'జగన్మోహిని'లో నటిస్తోంది. ఇది జయమాలిని నటించిన అలనాటి 'జగన్మోహిని'కి రీమేక్.